ఘనంగా బూచేపల్లి సుబ్బారెడ్డి జయంతి



బూచేపల్లి సుబ్బారెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, ఇతర కుటుంబ సభ్యులు, నాయకులు



పేదలకు దుస్తులు అందిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి

చీమకుర్తి: దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డి జయంతి వేడుకలను బుధవారం చీమకుర్తిలో ఘనంగా నిర్వహించారు. సుబ్బారెడ్డి సతీమణి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కుమారుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, కోడలు నందిని, కుమార్తె బూచేపల్లి ధనలక్ష్మి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు స్థానికంగా ఉన్న బూచేపల్లి సుబ్బారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బూచేపల్లి పార్కులో సుబ్బారెడ్డి స్మారకాన్ని పూలతో సుందరంగా అలంకరించి నివాళులర్పించారు. దర్శి నియోజకవర్గం, చీమకుర్తి ప్రాంతాలకు, ప్రజలకు సుబ్బారెడ్డి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. అనంతరం బూచేపల్లి పార్కు వద్ద పేదలకు నూతన వస్త్రాలు అందించారు. కార్యక్రమంలో చీమకుర్తి మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, మండల రూరల్ కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, మన్నం శ్రీధర్, కౌన్సిలర్లు బీమన వెంకట్రావు, చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, దాసరి లక్ష్మీనారాయణ, మంచా హరికృష్ణ, గోపురపు చంద్ర, మేకల యల్లయ్య, షేక్ బాషా, స్థానిక సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

కార్యదర్శులు సక్రమంగా పనిచేయాలి

మద్దిపాడు: గ్రామ కార్యదర్శులు రాజకీయాలతో సంబంధం లేకుండా సక్రమంగా విధులు నిర్వహించాలని ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోని సమావేశ మందిరంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. కార్యదర్శులు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలా జరగకుండా చూసుకోవాలని ఎంపీపీ హితవు పలికారు. సీతారాంపురం సచివాలయం ఇన్‌చార్జి కార్యదర్శిగా పనిచేస్తున్న శ్రీనివాసరావుపై ఎంపీపీకి విలేకరులు ఫిర్యాదు చేశారు. తమను అసభ్య పదజాలంతో దూషించడంపై ఎంపీపీకి వినతిపత్రం ఇవ్వడంతో పాటు దీనిపై జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. చర్యలు తీసుకోవాలని ఎంపీపీని కోరారు. ఎంపీపీ స్పందిస్తూ ఆరోపణలపై వివరణ ఇవ్వాలి తప్ప విలేకరులను దూషించడం సరికాదంటూ ఖండించారు.

పత్రాలు లేని వాహనాలు సీజ్

నాగులుప్పలపాడు: సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే ఆ వాహనాలను సీజ్ చేస్తామని నాగులుప్పలపాడు ఎస్సై బ్రహ్మనాయుడు హెచ్చరించారు. బుధవారం నాగులుప్పలపాడులో నిర్వహించిన వాహనాల తనిఖీ స్పెషల్ డ్రైవ్‌లో సరైన పత్రాలు లేని, నంబరు ప్లేట్లు లేని, హెల్మెట్ ధరించని వారి 12 వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

సెప్టెంబర్ 1 నుంచి రాష్ట్రస్థాయి కరాటే పోటీలు

ఒంగోలు: రాష్ట్రస్థాయి కరాటే టోర్నమెంట్‌ను సెప్టెంబర్ 1వ తేదీ నుంచి స్థానిక మహాలక్ష్మి కళ్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు సిద్దార్థ కరాటే అకాడమీ కార్యదర్శి నల్లూరి మోహనరావు తెలిపారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చేతుల మీదుగా ఆయన నివాసంలో సిద్దార్థ అకాడమీ ఇంటర్ స్టేట్ కరాటే టోర్నమెంట్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆత్మరక్షణకు ఉపయోగపడే మార్షల్ ఆర్ట్స్‌ను ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. మోహనరావు మాట్లాడుతూ కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల నుంచి వెయ్యి మంది కరాటే విద్యార్థులు పోటీల్లో పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో శ్రీప్రతిభ విద్యాసంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు, మండవ సుబ్బారావు, మారెళ్ల సుబ్బారావు, మండవ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి డిగ్రీ ఆన్‌లైన్ రెండో విడత ప్రవేశాలు

ఒంగోలు: డిగ్రీ ఆన్‌లైన్ రెండో విడత ప్రవేశాలు ఈనెల 22 నుంచి నిర్వహిస్తున్నట్లు స్థానిక దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ కాలేజీలో చేరాలనుకున్న విద్యార్థినులు ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, 23 నుంచి వెబ్ ఆప్షన్స్ ఓపెన్ అవుతాయన్నారు. ఈనెల 28వ తేదీ సీట్ అలాట్‌మెంట్స్ జరుగుతాయని, ఈనెల 29 నుంచి సెప్టెంబర్ 3వ తేదీలోపల విద్యార్థులు తాము ఎంచుకున్న కాలేజీలో రిపోర్టు చేయాల్సి ఉంటుందన్నారు. జిల్లాలోని విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాలేజీలో సహాయ కేంద్రం ఏర్పాటు చేశామని, ఆ సహాయ కేంద్రంకు అధిక సంఖ్యలో విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వైద్యుల రక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలి



జూనియర్ వైద్యురాలిపై అత్యాచారాన్ని నిరసిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న ఐఎంఏ ప్రతినిధులు

ఒంగోలు టౌన్: ప్రజల ప్రాణాలను కాపాడే వైద్యులకు పటిష్టమైన రక్షణ చర్యలు తీసుకోవాలని ఏఎంఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డా. జాలాది మణిబాబు డిమాండ్ చేశారు. ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ వైద్యులు, వైద్యశాలలపై రోజురోజుకీ దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కోల్‌కత్తా ఘటన దీనికి పరాకాష్ట అని పేర్కొన్న ఆయన ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డా.రావిపాటి జయశేఖర్ కోరారు. ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు డా.ఝాన్సీ, డా.శ్రావణి, డా.శ్రీదేవి మాట్లాడుతూ సెంట్రల్ ప్రొటెక్షన్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, విధి నిర్వహణలో నిర్భయంగా పనిచేసేలా మహిళా వైద్యులకు భరోసా కల్పించాలని కోరారు. చర్చి సెంటర్లో మానవహారం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ కళాశాల విద్యార్థులు, హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థులు, జూడా నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రముఖ వైద్యులు నల్లూరి రాఘవరావు, విద్యా శంకర్, సుబ్బానాయుడు, మాధవీలత, కల్పన, మణిమాల, రోహిణి, ప్రభాకరరావు, కంచర్ల హనుమంతరావు, నామినేని కిరణ్, రామకృష్ణుడు, ఎంవీ రామారావు, తిరుమలరావు, కేఆర్‌వీ ప్రసాద్ ర్యాలీలో పాల్గొన్నారు.